క్లుప్తంగా

వెద పద్ధతి ద్వారా రైతులకు తక్కువ ఖర్చు



దుగ్గిరాల: వరి సాగులో వెద పద్ధతి ద్వారా రైతులకు తక్కువ ఖర్చు.. నీటి వినియోగం కూడా తగ్గుతుందని ఏవో ఆర్ విజయ్‌బాబు తెలిపారు. దుగ్గిరాల మండలంలోని మోరంపూడి, రేవేంద్రపాడు గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాలలో ఆయన మంగళవారం పాల్గొని మాట్లాడారు. వెద పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యాన అధికారి టి.శ్రీనిత్య మాట్లాడుతూ.. ఉద్యాన, కూరగాయల పంటల విత్తనాలపై రాయితీని ఉద్యాన శాఖ ద్వారా పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైతు సోదరులు, వెటనరీ అసిస్టెంట్ సర్జన్ ఎస్ సతీష్, వీఏఏ నీలవేణి పాల్గొన్నారు.

మహంకాళీమాతకు విశేష పూజలు



ఫిరంగిపురం: ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామంలోని కోటిలింగాల క్షేత్రంలో ఆషాఢ మాసం సందర్భంగా మంగళవారం మహంకాళీ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరించారు. అనంతరం పలు రకాల కూరగాయలతో శాకంబరీదేవిగా అలంకరించి అష్టోత్తర, సహస్ర నామాలతో కుంకుమార్చనలు చేశారు. గ్రామానికి చెందిన మహిళలు అమ్మవారికి ఊరేగింపుగా వచ్చి సారెను సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

పారిశుద్ధ్యం సక్రమంగా నిర్వహించాలి



దుగ్గిరాల: ప్రతి గ్రామంలో పారిశుద్ధ్యం సక్రమంగా నిర్వహించాలని.. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే రూ.500 జరిమానా విధించనున్నామని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు అన్నారు. దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ షేక్ జబీనా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గ్రామాలలో 15వ ఆర్థిక సంఘం నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలో కొత్త చెత్త బుట్టలను ఇవ్వాలని పెదపాలెం సర్పంచ్ కోరారు. అందుకు ఎంపీడీవో సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మరీదు రాము, పి.సాయి చైతన్య, మండల ఈవో చంద్రమోహన్, పలుశాఖల అధికారులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెరిగిన మహిళా చైతన్యం



తాడేపల్లి రూరల్: రాష్ట్రంలో మహిళా చైతన్యం పెరిగిందని పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని అవంత బ్రాంకెట్ హాల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో జరిగిన వర్క్ షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మెప్మాను అన్ని మున్సిపాలిటీలలో అప్ గ్రేడ్ చేస్తున్నామని ఆయన అన్నారు. రానున్న మూడు నెలలలో 25 లక్షల మహిళలకు ఎకనామిక్ యాక్టివిటీ కల్పించాలి నిర్ణయించినట్లు తెలిపారు. నగర పరిధిలో ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్‌లను ఉపయోగించి యాక్టివిటీ చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్, తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలు పంపిణీ

ఫిరంగిపురం: మండలంలోని కండ్రిక, వేమవరం, నుదురుపాడు గ్రామాల్లో నరసరావుపేటకు చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను మంగళవారం భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసరావుపేట కమిటీ అధ్యక్షుడు జి.పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. త్రైత సిద్ధాంత జ్ఞానం ద్వారా సమాజంలో అసమానతలు తొలగించేందుకు ఈ గ్రంథం దోహదపడుతోందని అన్నారు. కార్యక్రమంలో ఎ.రమేష్, పి.రామయ్య, కె.చిన్నవెంకటేశ్వర్లు, పి.ఏడుకొండలు, టి.అమరలింగయ్య, ఎ.రామాంజనేయులు, పి.అశోక్, సీహెచ్ భాస్కరరావులు పాల్గొన్నారు.

● డ్రెయిన్ నుంచి పొంగుతున్న మురుగు!



తాడేపల్లి పట్టణ పరిధిలోని తాడేపల్లి ప్రాతూరు నుంచి కొత్తూరు వెళ్లే మార్గంలో బకింగ్‌హామ్ కెనాల్ బ్రిడ్జి వద్ద మురుగు మళ్లించేందుకు రోడ్డు కింద పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. ఈ పైప్‌లైన్‌లో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు డ్రైనేజీ నుంచి పొంగి రోడ్డుపైకి వచ్చి బ్రిడ్జి కిందకు చేరుతోంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో మురుగు ఎక్కువగా పారుతుండడంతో ఆ రహదారిలో ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి పైప్‌లైన్‌లలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించి మురుగు బయటకు రాకుండా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. – తాడేపల్లి రూరల్

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు



మొక్కలు నాటుతున్న సభ్యులు

తాడేపల్లి రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి వారి ఆధ్వర్యంలో 2025-26వ సంవత్సరానికి ప్రథమ సేవా కార్యక్రమంగా ప్రెసిడెంట్ ప్రెగడ రాజశేఖర్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి గాలి గోపురం పరిసరాలలో మంగళవారం మొక్కలను నాటారు. రోటరీ ప్రాధాన్యతలో ఒకటైన పర్యావరణ పరిరక్షణలో భాగంగా.. డిస్ట్రిక్ట్ గవర్నర్ కోటి మొక్కలు నాటాలనే లక్ష్యాన్ని సాధించే దిశగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమాన్ని డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్‌వీ రామ్‌ప్రసాద్ మొదటి మొక్క నాటి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ కె.సునీల్ కుమార్, పీడీజీ అన్నే రత్న ప్రభాకర్, అసిస్టెంట్ గవర్నర్ పూర్ణచందు, సెక్రెటరీ నిరంజన్ గుప్తా, చార్టర్ ప్రెసిడెంట్ ఇసునూరి అనిల్ చక్రవర్తి, పాస్ట్ ప్రెసిడెంట్ గాజుల శ్రీనివాసరావు, ట్రేజరర్ కేవీఎస్ ప్రకాశరావు, పాస్ట్ సెక్రెటరీ అందే మురళి, సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

తాడేపల్లి రూరల్: తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు మంగళవారం నాటికి 224 రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, దర్శి మాణిక్యారావు, వై.సాంబశివరావులు ప్రారంభించారు. యూనియన్ నాయకుడు కె.స్టీవెన్ మాట్లాడుతూ.. కార్మికులు బకాయిలు అందేవరకు ఓపిగ్గా ఉండాలని అన్నారు. సమస్యకు పరిష్కారం దగ్గరలోనే ఉందని ఆయన కార్మికులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో యహోషువ, ఆశీర్వాదం, షైక్ ఆరిఫ్, మల్లె గురవయ్య, తుపాకుల నాగేశ్వరావు, బి.సూర్యప్రకాశరావు, డి.నాగేశ్వరావు, జి.నాగరాజు, అంకయ్య, షైక్ హిమాంబి, వై.రమాదేవి, దుర్గాభవాని, శివకుమారి, శారమ్మ, కాసమ్మ, అన్నమ్మ, రిబ్కా, దేరంగుల రమణమ్మ, మొలక శారద, గండికోట జ్యోతి, దామవరపు సువర్ణకుమారి, బి.నవనితం పాల్గొన్నారు.

చెట్టుకు నిప్పు పెట్టిన దుండగులు

దుగ్గిరాల: దుగ్గిరాల మండలం చింతలపూడి సమీపంలో తెనాలి-విజయవాడ రహదారి పక్కన మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాటి చెట్టుకు నిప్పు పెట్టారు. దీంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. అగ్నికీలకలు పక్కనే ఉన్న చెట్లును కూడా తాకడంతో అవి పాక్షికంగా కాలిపోయాయి. సమీపంలో జనసంచారం లేకపోవడంతో ఎవరికీ ఏ హానీ జరగలేదు.

ఆసక్తి ఉన్న రంగంలో రాణించండి

ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఆకుల ఉదయ్‌కుమార్



మాట్లాడుతున్న కల్నల్ ఉదయ్ కుమార్

తెనాలిఅర్బన్: ఆసక్తి ఉన్న రంగంలో అందరూ రాణించే విధంగా చూసుకోవాలని 22వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఆకుల ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్, కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలురోన్నత పాఠశాలలో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు నైపుణ్యాల ఆధారిత విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. కెఎస్ఎం స్కూల్ హెచ్‌ఎం కప్పల రాజారెడ్డి మాట్లాడుతూ యువత ఉద్యోగాలు పొందలేకపోవడానికి ప్రధాన కారణం వారు ఎంచుకున్న రంగంలో నైపుణ్యం లేకపోవడమేనని తెలిపారు. యువతలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అనేక పథకాలు ప్రభుత్వాలు ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. సమావేశాల్లో బాయ్స్ హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎన్.ఇందుశేఖర్, ఉపాధ్యాయులు కొడాలి గోవర్ధన్, ఎస్.మస్తాన్‌రావు, ఎం.ప్రసాద్, కొండూరు శ్రీనివాసరావు, పరిశా సర్దార్, అంబారీషుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలను సమర్థంగా ఎదుర్కోవాలి

మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ



విద్యార్థులకు మెళకువలు నేర్పిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ బృందం

తెనాలిరూరల్: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వాటిని ఎదుర్కొవడంలో సమర్థవంతంగా వ్యవహరించాలని మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ చెప్పారు. రూరల్ గ్రామం కొలకలూరు బోసు బొమ్మ సెంటర్ పురవేదికపై తాడేపల్లి ఎన్డీఆర్‌ఎఫ్ బృందం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఎన్డీఆర్‌ఎఫ్ బృందం గ్యాస్ లీకేజీ, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తదితర కారణాలతో సంభవించిన అగ్ని ప్రమాదాలను తప్పించుకోవడంలో పాటించాల్సిన విధానాలను విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్ని ప్రమాదంలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించే విధానాన్ని కూడా తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్డీఆర్‌ఎఫ్ బృందం నేర్పిన మెళకువలను విద్యార్థులు గుర్తించుకోవాలని, తల్లిదండ్రులకు కూడా తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది, జెడ్పీ హైస్కూలు విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు విద్యుత్ మోటార్ కనెక్షన్‌లు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ చందు సాంబశివుడు

తెనాలిటౌన్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు నీటి ఎద్దడి లేకుండా విద్యుత్ మోటార్ కనెక్షన్‌లు సత్వరమే ఇవ్వాలని కాంగ్రెస్‌పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చందు సాంబశివుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక చెంచుపేటలోని విద్యుత్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీవీ చిరంజీవికి కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. వర్షాభావం ఉన్నందున చివరి భూములకు నీటి ఎద్దడి లేకుండా అవసరమైన ప్రతి రైతుకువిద్యుత్ మోటార్ కనెక్షన్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పి.నాగసూర్యశశిధరరావు, పెనుగొండ శివకుమార్, పి.స్టీవెన్ బాబు, రాయప్ప, కోటేశ్వరరావు, వీరాస్వామి, అయ్యప్ప, అఖిల్, పూలేరామ్, మల్లిఖార్జునరావు, ద్వారక శ్రీను, తదితరులు ఉన్నారు.

భూములను కాపాడాలంటూ వినతి



తాడికొండ: మండలంలోని దొండపాడు క్రిస్టియన్ సొసైటీ భూముల స్వాహాకి కొందరు వ్యక్తులు యత్నిస్తున్నారని సొసైటీ సభ్యులు తుళ్లూరు తహసీల్దార్ సుజాతకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. దొండపాడులోని ఆర్‌సీఎం క్రిస్టియన్ సంఘానికి దొండపాడుకు చెందిన లంక భూమి 40 ఎకరాలు ఉందని అన్నారు. రాజధాని అమరావతిగా అయిన తరువాత భూములకు రెక్కలు వచ్చిన నేపథ్యంలో తమకు సంబంధం లేని బయట వ్యక్తులను సొసైటీలో చేర్చి అదును చూసుకుని భూములను కబ్జాకి గురిచేసేందుకు ఇప్పటికే ప్రక్రియ ప్రారంభించారన్నారు. ఇందులో భాగంగా సర్వేయర్‌తో సర్వే చేయించి కంప్యూటర్ 1బి, అడంగల్‌లో ఉన్న వ్యక్తుల పేర్లు తొలగించి కొత్త వ్యక్తుల పేర్లు చేర్చే యత్నం జరుగుతుందని తెలిపారు. సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరినట్లు సభ్యులు పేర్కొన్నారు.

విజయవంతంగా కంటి శుక్లాల ఆపరేషన్

తాడేపల్లి రూరల్: విజయవాడకు చెందిన అమరావతి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈనెల 13వ తేదీన మంగళగిరిలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో రోగులకు చేసిన ఆపరేషన్‌లు విజయవంతం అయ్యాయని స్థానిక టీడీపీ నాయకుడు కోలా శ్రీనివాసరావు తెలిపారు. గుర్తించిన రోగులకు మంగళవారం కంటి శుక్లాల ఆపరేషన్లు చేశారు. వైద్య శిబిరంలో 106 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 23 మంది శుక్లాల శస్త్ర చికిత్సకు అర్హులుగా గుర్తించారు. వారిలో ఆసుపత్రిలో 13 మందికి విజయవంతంగా ఆపరేషన్లు చేశారు. కార్యక్రమంలో స్థానిక వార్డు టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తురకా వీరశేఖర్, తోట కరుణకుమార్ యాదవ్, పసుపులేటి సదాశివ రావు, గాజుల క్రాంతి కుమార్, తెలుగు మహిళా నాయకురాలు రజియా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఇంటి తాళం పగలగొట్టి చోరీ



తాడేపల్లి రూరల్: తాళం పగలగొట్టి.. ఇంట్లోకి చొరబడి.. నగదు, బంగారాన్ని దొంగిలించిన ఘటన తాడేపల్లి పట్టణంలో చోటు చేసుకుంది. తాడేపల్లి ఎస్ఐ స్వామి శ్రీనివాస రావు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాష్‌నగర్‌లో నివాసం ఉంటున్న బొందలపాటి యోగేశ్వరరావు ఈ నెల 9వ తేదీన కుటుంబ సభ్యులతో నాగపట్నం వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని రూ.5 వేల నగదు, 13 గ్రాముల బంగారపు ఆభరణాలు దొంగిలించినట్లు గుర్తించారు. దీంతో బాధితుడు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన బంగారం విలువ సుమారు రూ.55 వేలు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



దుగ్గిరాల: దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గ సభ్యులు.. యార్డు చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని స్థానిక పసుపు యార్డులో మంగళవారం నిర్వహించారు. యార్డు చైర్మన్‌గా ఉన్నం ఝాన్సీరాణి ప్రమాణ స్వీకారాన్ని యార్డు సెక్రెటరీ జేవీ సుబ్బారావు చేయించారు. అనంతరం ఆమెకు దుగ్గిరాల ఎంపీపీ షేక్ జబీన్ పుష్పగుచ్ఛ అదించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, కె.శ్రీఅనిత, వి.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

డాక్టర్ రమేష్‌కు ఎన్టీఆర్ జాతీయ పురస్కారం



తెనాలిరూరల్: పట్టణానికి చెందిన డాక్టర్ రంగిశెట్టి రమేష్‌కు హైదరాబాద్‌కు చెందిన తెలుగు వెలుగు సాహితీ వేదిక, తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ సంస్థ ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని అందజేసింది. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ వెంకట దీక్షితులు కళావేదికలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రమేష్ పురస్కారాన్ని అందుకున్నారు. సాహితీ రంగంలో చేసిన సేవలకు గాను పురస్కారాన్ని ఇచ్చినట్టు రమేష్ తెలిపారు. వంగాల శాంతి కృష్ణ, దైవజ్ఞ శర్మ, డాక్టర్ ఎస్.శాంతాబాయి, గుర్రం జాషువా వారసురాలు అమృతపూడి రేవతి, నవలా రచయిత్రి గంటా రజిని, డాక్టర్ పెద్దినపూడి ప్రశాంతి పాల్గొన్నారు.

వెస్ట్రన్ డ్యాన్స్‌లో సత్తాచాటిన సాయి సృజన్



సృజన్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న రాజశేఖర్

తాడేపల్లి రూరల్: సీడీఎస్ డ్యాన్స్ అకాడమీ మాస్టర్ చంటి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ డ్యాన్స్ కల్చరల్ అసోసియేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గుంటూరు జిల్లా అర్చక పర్యవేక్షక పురోహితులు శ్యామసుందర శాస్త్రి మనుమడు, మంగళగిరి శివాలయం ప్రధాన అర్చకులు మహేష్ కుమార్ శర్మ కుమారుడు చిరంజీవి సాయి సృజన్ అభినందన పురస్కారం గెలుచుకున్నారు. మంగళగిరిలో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లుక్స్ రాజశేఖర్ చేతుల మీదుగా ప్రశంసా పురస్కారం అందుకున్నారు. మంగళగిరి నగరంలోని గౌతమబుద్ధ రోడ్డు, బంగ్లా సమీపంలో ఉన్న సీడీఎస్ డ్యాన్స్ అకాడమీలో గత మూడేళ్లుగా సాయి సృజన్ వెస్ట్రన్ డ్యాన్స్‌లో శిక్షణ పొందుతున్నాడు. తొలిసారిగా సర్టిఫికెట్ పొందిన సాయి సృజన్‌ను నగరంలోని ప్రముఖులు అభినందించారు.

జనాభా పెరుగుదలపై బాబు మాటలు విడ్డూరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న గోపీనాథ్

తాడేపల్లి రూరల్: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని సీఎం చంద్రబాబు సచివాలయంలో భారతదేశంలో జనాభా తగ్గిపోవడం ఆందోళన కలిగించే విషయమని మాట్లాడుతున్నారని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి జి.గోపీనాథ్ అన్నారు. మంగళగిరిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు కుటుంబ నియంత్రణ పాటించమని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు ఉన్నపళంగా అధిక జనాభా విధానం ప్రతి కుటుంబానికి ముఖ్యం అనడం విడ్డూరంగా ఉందన్నారు. జనాభా పెరుగుదల ఆలోచన వెనుక పెట్టుబడిదారుల ప్రయోజనం ఉన్నదని.. కార్మికుల అదనపు శ్రమ దోపిడీని పెట్టుబడిదారులకు ఉపయోగకరంగా బాబు చూస్తున్నారని ఆయన ఆరోపించారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ఎస్‌కే నాగూర్ వలి, జిల్లా కమిటీ సభ్యులు పి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

● గ్రామ దేవతలకు ఆషాఢం సారె!



ఆషాఢ మాసం సందర్భంగా తాడేపల్లి పశువుల హాస్పటల్ వద్ద గల బ్రహ్మంగారి ఆలయం నుంచి మహిళలు గ్రామ దేవతలకు భక్తి శ్రద్ధలతో సారె సమర్పించారు. డప్పు చప్పుళ్లు, కోలాటాల నృత్యాల నడుమ మంగళవారం అమ్మవారికి సారె సమర్పించారు. తాడేపల్లికి చెందిన దార్ల హేమపద్మ ఆధ్వర్యంలో మేళతాళాలు.. కోలాటాలతో గ్రామదేవత గంగానమ్మ అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం పూజలు నిర్వహించి సారె సమర్పించి అమ్మవారికి నమస్కరించారు. – తాడేపల్లి రూరల్

ఘనంగా రెండో రోజు కార్మెల్ మాత ఉత్సవాలు



దివ్యసత్ ప్రసాదాన్ని ఊరేగిస్తున్న విశ్వాసులు



వాక్యోపదేశం చేస్తున్న మేత్రాసన గురువులు

ఫిరంగిపురం: విశ్వాసులకు కోరిన వరాలనిచ్చే మాత కార్మెల్ తల్లి అని గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. కార్మెల్ మాత ఉత్సవాల సందర్భంగా రెండో రోజు మంగళవారం దివ్యపూజాబలి కార్యక్రమం నిర్వహించారు. బాల ఏసుదేవాలయం వద్ద నుంచి మరియమాత విగ్రహం, దివ్యసత్ ప్రసాదాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామంలో ఊరేగిస్తూ కార్మెల్ కొండకు తీసుకువచ్చారు. కొండ దిగువ భాగంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదిక వద్ద దివ్యపూజాబలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యయ్య వాక్యోపదేశం చేస్తూ దేవుడి ఆశీర్వాదానికి మన మందరం వారసులమని చెప్పారు. ఏటా కార్మెల్ మాత ఉత్సవం అనంతరం వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయని తెలిపారు. అనంతరం దివ్యసత్ ప్రసాద పూజాబలి నిర్వహించి భక్తులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బాల ఏసుదేవాలయ విచారణ గురువులు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి, సహాయ విచారణ గురువులు సాగర్, మఠకన్యాస్త్రీలు, గుడిపెద్దలు, కథోలిక క్రైస్తవులు పాల్గొన్నారు.

ఎరువుల షాపులపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

- నందివెలుగులో 145 బస్తాల డీఏపీ సీజ్
- గన్నవరం సహాయ సంచాలకులు ఎం.సునీల్



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

తెనాలిటౌన్: రూరల్ మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల షాపులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం మెరుపుదాడి నిర్వహించారు. నందివెలుగు గ్రామంలోని శ్రీ సాయి కామాక్షి ట్రేడర్ షాపులో తనిఖీలు చేపట్టగా స్టాక్ రిజిష్టర్‌లో వ్యత్యాసాన్ని గుర్తించి 145 బస్తాల డీఏపీని సీజ్ చేశారు. తనిఖీ అధికారి, గన్నవరం సహాయ సంచాలకులు ఎస్.సునీల్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తెనాలి మండలంలోని పలు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల షాపులపై ఆకస్మిక తనిఖీలు చేపట్టగా నందివెలుగులోని కామాక్షి ట్రేడర్ షాపునందు భారీగా డీఏపీ బస్తాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వీటి ధర రూ.1,95,750లుగా వివరించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతుల సేవార్థం రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిబంధనలకు విరూద్ధంగా డీఏపీ, పురుగు మందులు, విత్తనాలు కలిగి ఉన్నట్లయితే కేసులు నమోదు చేస్తామని డీలర్‌లను హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.రవిబాబు, తెనాలి మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు, గుంటూరు మండల వ్యవసాయాధికారి బి.కిషోర్ పాల్గొన్నారు.